క్లుప్తంగా

సన్మార్గంలో నడుచుకోవాలి

గుణదల (విజయవాడ తూర్పు): సన్మార్గంలో నడుచుకునే భక్తులు దేవుని ప్రేమలో జీవిస్తారని గుణదల మేరీమాత పుణ్యక్షేత్ర రెక్టర్ ఫాదర్ ఏలేటి విలియం జయరాజ్ అన్నారు. పుణ్యక్షేత్ర ప్రధానాలయంలో ఆదివారం సమష్టి దివ్యబలి పూజ చేశారు. ఆయన మాట్లాడుతూ బైబిల్ గ్రంథంలో దేవుడు ఆజ్ఞాపించిన నిబంధనల ప్రకారం నడుచుకోవాలని వివరించారు. అనంతరం సమష్టి దివ్యబలి పూజ సమర్పించి భక్తులకు సత్ప్రసాదాన్ని అందజేశారు. విశ్వాసులు కొండపై కొలువు దీరిన మరియమాతను దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. శిఖరాగ్రాన ఉన్న ఏసుక్రీస్తు సిలువ వరకు కాలినడకన చేరుకున్నారు. ఆలయ గురువులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

కొత్త రాజకీయ పార్టీ పెడతాం

సామాజిక వేత్త రామచంద్ర యాదవ్

గుణదల (విజయవాడ తూర్పు): ఏపీలో నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేసే దిశగా అడుగులు వేస్తున్నామని సామాజిక వేత్త బోడే రామచంద్ర యాదవ్ తెలిపారు. గుణదల రింగ్ రోడ్డు సమీపంలోని ది వెన్యూ ఫంక్షన్ హాల్లో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ప్రజలకు ఏ మాత్రం న్యాయం చేయలేదన్నారు. ముఖ్యంగా టీడీపీ హయాంలో అభివృద్ధి శూన్యమని చెప్పారు. టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజలను కేవలం ఓటు బ్యాంక్ గానే పరిగణించారన్నారు. కుటుంబ, కుల రాజకీయాలకు స్వస్తి పలికే సమయం వచ్చిందని, అందుకే రాష్ట్రంలో నూతన రాజకీయ పార్టీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే నెల 23న ప్రజా చైతన్య వేదికపై కొత్త పార్టీని ప్రకటించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

యోగాతో ఆహ్లాదం..ఆరోగ్యం



లబ్బీపేట(విజయవాడతూర్పు): మానసిక ఆహ్లాదం, శారీరక ఆరోగ్యానికి యోగా తోడ్పడుతుందని ఫెర్టికేర్ ఐవీఎఫ్ సెంటర్ ఆపరేషన్స్ ఏజీఎం అనూష అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ఆ సంస్థలో యోగా జుంబా ఈవెంట్ నిర్వహించారు. ఉమెన్స్ డెంటల్ కౌన్సిల్, ఇండియన్ డెంటల్ అసోసియేషన్ కోస్టల్ ఏపీ బ్రాంచ్‌లతో కలిసి నిర్వహించిన కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అనూష మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని అధిగమించి జీవితంలో విజయం సాధించడానికి యోగా, జుంబా ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రత్యూష, రామ్‌సునీల్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ధర్మపథంలో భాగంగా ఆదివారం ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో పలువురు చిన్నారులు ప్రదర్శించిన భరత నాట్య ప్రదర్శన భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై హైదరాబాద్‌కు చెందిన శ్రీనాట్య కళానికేతన్ బృందానికి చెందిన నృత్యకారులు పలు కీర్తనలకు భరత నాట్యాన్ని ప్రదర్శించారు. అనంతరం వారు దుర్గమ్మ దర్శనం చేసుకున్నారు. ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

నేటి నుంచి ఎస్ఆర్ఆర్‌లో ఆన్‌లైన్ అడ్మిషన్లు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఈనెల 19 నుంచి 24వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భాగ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆసక్తి అర్హత కలిగిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కళాశాలలో హెల్ప్‌డెస్క్‌ను సైతం ఏర్పాటు చేశామని తెలిపారు.

ఘనంగా ఫాదర్స్ డే

మధురానగర్(విజయవాడసెంట్రల్): కుటుంబం కోసం ఎన్నో త్యాగాలు చేసే తండ్రిని గౌరవించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, 30వ డివిజన్ కార్పొరేటర్ బి.జానారెడ్డి అన్నారు. అయోధ్యనగర్‌కు చెందిన జయహో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యాన ఆదివారం ఫాదర్స్ డే సందర్భంగా తండ్రుల సత్కార కార్యక్రమం జరిగింది. వారు మాట్లాడుతూ కన్నతల్లికి ఎంత విలువ ఉంటుందో, తండ్రికి కూడా అంతే విలువ ఉంటుందన్నారు. కుటుంబానికి యజమానిగా, ఇంటికి పెద్దదిక్కుగా వ్యవహరిస్తూ తండ్రి అన్ని బరువు బాధ్యతలను తన భుజాన మోస్తాడని తెలిపారు. జయహో వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీ మాట్లాడుతూ ఫాదర్స్ డే.. తండ్రి ప్రేమ, అంకితభావాన్ని గౌరవించే ఒక ప్రత్యేక సందర్భం అన్నారు. తండ్రి పాత్ర ఎంతో కఠినమైనది, చాలా గొప్పదని చెప్పారు. అనంతరం రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ ఎస్‌వీవీ కోటేశ్వరరావు, మల్లికార్జునరావు, సత్యనారాయణరావు, వరప్రసాద్ తదితరులను శాలువా కప్పి జ్ఞాపికలతో సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

సామాజిక వికాసానికి ‘వాసవి’ సేవలు



క్రీడల్లో బహుమతులు సాధించిన సభ్యులను అభినందిస్తున్న వాసవి క్లబ్ సభ్యులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సమాజానికి వాసవి సంస్థలు అందిస్తున్న సేవలు అమోఘమని వాసవి క్లబ్స్ ఇంటరేషనల్ అంతర్జాతీయ మాజీ కార్యదర్శి పాత సుదర్శన్ అన్నారు. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశం, ఇటీవల జాతీయ స్థాయిలో బహుమతులు పొందిన సభ్యుల అభినందన కార్యక్రమం ఆదివారం కేబీఎన్ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాత సుదర్శన్ మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా వాసవి క్లబ్స్ వివిధ రూపాల్లో సామాజిక వికాసానికి పాటుపడుతున్నాయన్నారు. సమాజంలో అట్టడుగు వర్గాలకు వివిధ రకాల సేవలందిస్తున్నాయన్నారు. వాసవీ సంస్థల నిర్వాహకులు మరింత ఐక్యంగా, విస్తృత కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలోకి వెళ్లాలని సూచించారు. ఈ సందర్భంగా ఇటీవల జాతీయ స్థాయిలో జరిగిన వాసవి క్లబ్ సభ్యుల క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి బహుమతులు సాధించిన సభ్యులను అభినందించారు. షటిల్, చెస్ పోటీల్లో ప్రథమ బహుమతులు పొందారని జిల్లా గవర్నర్ మిత్తింటి శారద వివరించారు. జిల్లా పరిధిలోని వివిధ క్లబ్‌ల కార్యవర్గాలు వారివారి పరిధుల్లో నిర్వహించిన కార్యక్రమాల నివేదికలను అందించారు. కార్యక్రమంలో క్లబ్స్ అంతర్జాతీయ ఉపాధ్యక్షులు నందిపాటి శ్రీనివాసరావు, అంతర్జాతీయ సంయుక్త కార్యదర్శి బొడ్డు శ్రీనివాసరావు, క్లబ్ ప్రముఖులు గద్దం పవన్‌కుమార్, ఇమ్మిడిశెట్టి సురేష్‌బాబు, అనంతుల ఇందిర, కేఎల్వీ సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పవన్‌తో రాష్ట్రానికి ఒరిగేది సున్నా

- జనసైనికులు కంటే చంద్రబాబుపైనే పవన్‌కు నమ్మకం
- ఏపీ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ షేక్ ఆసిఫ్



మాట్లాడుతున్న షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తనను అమితంగా అభిమానించే జనసైనికులను సైతం నమ్మలేని పవన్‌కల్యాణ్ రాష్ట్ర ప్రజలకు ఏమి మేలు చేస్తాడని ఏపీ స్టేట్ మైనార్టీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ షేక్ ఆసిఫ్ ప్రశ్నించారు. ఆయనతో రాష్ట్ర ప్రజలకు ఒరిగేది శూన్యమని పేర్కొన్నారు. తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. వారాహి యాత్ర పేరుతో పర్యటిస్తున్న పవన్‌కల్యాణ్ తనపైతనకు కూడా నమ్మకం లేకుండా ఏదేదో మాట్లాడటం ఆయన అవగాహనా రాహిత్యానికి అద్దం పడుతుందన్నారు. పవన్‌కల్యాణ్‌కు చంద్రబాబుపై తప్ప మరెవరిని నమ్మటానికి సిద్ధంగా లేడని ఎద్దేవా చేశారు. చంద్రబాబు కోసం పరితపించే పవన్‌కల్యాణ్ తన అభిమానులను టీడీపీకి తాకట్టు పెడుతున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబును ప్రశ్నించటం చేతకాని పవన్‌కల్యాణ్ నేడు మళ్లీ ఎన్నికల వేళ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. నాడు అమరావతిలో పర్యటించిన పవన్ రైతుల నుంచి టీడీపీ ప్రభుత్వం భూములు లాక్కొంటుందని చంద్రబాబును ప్రశ్నిస్తానని చెప్పి వెళ్లి ఇప్పటి వరకూ ఆ ప్రాంతానికి వెళ్లలేదన్నారు. జగన్ మోహన్‌రెడ్డి ధైర్యంగా తాను మేలు చేశానని భావిస్తేనే తనకు ఓటు వేయాలని ప్రజలను అడుగుతున్నారన్నారు. దేశంలో అటువంటి దమ్ము, ధైర్యం ఉన్న నాయకుడు మరొకరు లేరన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు ప్రజలకు అడ్డగోలు వాగ్దానాలు చేస్తూ ప్రజలను ఏమారుస్తున్నారని విమర్శించారు.

అంకమ్మ శక్తిపీఠంలో ప్రత్యేక పూజలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మ శక్తిపీఠంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు జరిగాయి. ఆలయ వ్యవస్థాపకుడు అన్నాబత్తుల శరాబందీరావు అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చనలు, శ్రీచక్రార్చన, చండీ హోమం నిర్వహించారు.

జగన్ మైనార్టీల పక్షపాతి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): సీఎం జగన్ మోహన్‌రెడ్డి మైనార్టీల పక్షపాతి అని వక్ఫ్‌బోర్డు జిల్లా అధ్యక్షుడు షేక్ గౌస్‌మొహిద్దీన్ అన్నారు. 'హర్ దిల్ మే వైఎస్ఆర్-హమ్ సబ్ జగన్ కే సాత్'లో భాగంగా షేక్ గౌస్‌మొహిద్దీన్ ఆదివారం ఇస్లాంపేటలోని మినార్ మసీద్‌లో అసర్ నమాజును ఆచరించి, అనంతరం మసీదు ఆవరణలో స్థానిక ముస్లిం పెద్దలు, మసీదు కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. మొహిద్దీన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో మైనారిటీల సంక్షేమానికి చేసిన ఖర్చును, అమలు చేసిన పథకాలను వివరించారు. ఈ సంవత్సరం రాష్ట్రం నుంచి పవిత్ర హజ్ యాత్రకు బయలుదేరిన సుమారు రెండు వేల మందిని గన్నవరం ఎయిర్ పోర్ట్ నుంచి పంపించారన్నారు. కార్యక్రమంలో మసీదు కమిటీ అధ్యక్షులు నూర్ అహ్మద్ షరీఫ్, ఉపాధ్యక్షులు మొహమ్మద్ మెహబూబ్ సాబ్, కార్యదర్శి మొహమ్మద్ అలీ తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్య పరికరాలతో అమెరికన్ క్యాన్సర్ కేర్



ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు విష్ణు, రామ్మోహన్, డాక్టర్ బొబ్బా రవికిరణ్ తదితరులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): అత్యాధునిక వైద్య పరికరాలతో హెమటాలజీ, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి చికిత్సలు అందించడానికి ఏర్పాటు చేసిన అమెరికన్ క్యాన్సర్ కేర్ ఆస్పత్రిని ఆదివారం ప్రారంభించారు. క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ బొబ్బా రవికిరణ్ ఆధ్వర్యంలో పుష్ప హోటల్ సమీపంలో ఏర్పాటు చేసిన ఈ ఆస్పత్రి ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, గద్దె రామ్మోహన్, నగరంలోని పలువురు వైద్యులు పాల్గొన్నారు. క్యాన్సర్ చికిత్సలను ఆధునిక సౌకర్యాలతో ఆస్పత్రిని ఏర్పాటు చేసిన బొబ్బా రవికిరణ్‌ను వారు అభినందించారు. డాక్టర్ రవికిరణ్ మాట్లాడుతూ లుకేమియా, లింఫోమా, మల్టీపుల్ మైలోమ వంటి రక్తసంబంధిత వ్యాధులను అతి తక్కువ సమయంలో నిర్ధారించి చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

కృష్ణా నదిలో గుర్తు తెలియని మృతదేహం లభ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కృష్ణానదిలో పిండాల ఘాట్ వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాలు... కృష్ణానదిలో పిండాల ఘాట్ వద్ద ఆదివారం ఉదయం ఒక వ్యక్తి మృతదేహం నీటిలో తేలియాడుతూ కనిపించింది. స్థానికులు సచివాలయ మహిళా పోలీసులకు సమాచారం అందించారు. మృతుడు గోల్డ్ కలర్ హాఫ్ హ్యాండ్ షర్ట్ ధరించి ఉన్నాడు. వయసు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుంది. ఊరు పేరు వివరాలు తెలియరాలేదు. దీనిపై మహిళా పోలీసు శ్యామలాదేవి భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేయగా గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశారు.

అమర గాయకులకు స్వరనీరాజనం



హనుమంతరాయ గ్రంథాలయంలో చిత్ర గీతాలు ఆలపిస్తున్న గాయనీ గాయకులు

విజయవాడ కల్చరల్: సునీల్ ఆర్కెస్ట్రా అండ్ ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం అమర గాయకులకు స్వరనీరాజనం, ఫాదర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు, బాలసుబ్రహ్మణ్యం, పిఠాపురం నాగేశ్వరరావు, మాధవపెద్ది సత్యం ఆలపించిన గీతాలను గాయకుడు సునీల్ ఆధ్వర్యంలో పలువురు గాయనీగాయకులు చిత్ర గీతాలను ఆలపించారు. వివిధ రంగాలకు చెందిన మారేపల్లి జోషి, జ్ఞానకిషోర్, డేవిడ్‌రాజు, ప్రవాసాంధ్ర గాయని సింధు, పరచూరి విజయలక్ష్మి పాల్గొన్నారు. గాయకునిగా విశిష్టసేవలను అందించిన సునీల్‌కు అమెరికాకు చెందిన ప్రైవేట్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భం పురస్కరించుకుని సంస్థ నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

-స్వరరాగార్చన ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానందం కళావేదిక మీద ఆదివారం నిర్వహించిన ఆపాత మధురాలు ఆకట్టుకున్నాయి.

యువకుడి ఆత్మహత్యయత్నం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఒంటరితనం, మద్యం అలవాటు కారణంగా యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య యత్నానికి పాల్పడిన ఘటన కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఘటనపై యువకుడు అక్క ఫిర్యాదుపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. జక్కంపూడి వైఎస్సార్ కాలనీలో బ్లాక్ నెం 220లో కందెపు నాని నివసిస్తున్నాడు. అతని తల్లిదండ్రులు లేరు. దీంతో అక్క కె. వరలక్ష్మి అండగా ఉంటోంది. ఆమె సింగ్‌నగర్‌లో ఉంటోంది. నానికి వివాహం కాకపోవడం, మద్యం అలవాటు కారణంగా మానసికంగా కుంగిపోయాడు. ఆదివారం మధ్యాహ్నం వరలక్ష్మి భర్త కిశోర్ వైఎస్సార్ కాలనీకి వచ్చాడు. నాని నివసిస్తున్న ఇంట్లో చూడగా అతను ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. అతను వరలక్ష్మికి ఫోన్ చేసి సమాచారం ఇచ్చాడు. స్థానికులకు తెలిపాడు. వారు నానిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం అతను స్పృహలో లేడు. అతనికి మెరుగైన వైద్యం అందిస్తున్నారని వైద్యులు పేర్కొన్నారు. ఘటనపై బాధితుడి అక్క పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు కేసు నమోదు చేశారు.

23 నుంచి పోలేరమ్మ జాతర



తిరునాళ్ల కరపత్రాన్ని విడుదల చేస్తున్న రామిరెడ్డి, కమిటీ సభ్యులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): స్థానిక ఊర్మిళా సుబ్బారావునగర్ గ్రామ దేవత పోలేరమ్మ జాతర తిరునాళ్ల ఈ నెల 23వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు పోలేరమ్మ దేవస్థానం కమిటీ అధ్యక్షులు సూరసాని రామిరెడ్డి తెలిపారు. ఆదివారం దేవస్థానం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరునాళ్ల కరపత్రాన్ని విడుదల చేశారు. రామిరెడ్డి మాట్లాడుతూ ఊర్మిళానగర్ గ్రామ దేవత పోలేరమ్మ వెలిసి 35 ఏళ్లు అయిన నేపథ్యంలో దేవస్థానంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, జాతర జరిపేందుకు కమిటీ నిర్ణయించిందన్నారు. తిరునాళ్లలో భాగంగా 23, 24, 25 తేదీల్లో ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు. జూలై 1వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా దేవస్థానం ప్రాంగణంలోని శ్రీలక్ష్మీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. సమావేశంలో దేవస్థానం కమిటీ కార్యదర్శి గుత్తావళి విజయ్‌బాబు, కోశాధికారి దొడ్డా వెంకటేశ్వరరెడ్డి, సభ్యులు సూరేపల్లి రాధాకృష్ణ, ఆలయ అర్చకులు గంటి సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత న్యాయ సేవలు అందిస్తాం



రికార్డులు పరిశీలిస్తున్న జడ్జి రామకృష్ణయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉచిత న్యాయ సేవలందిస్తామని జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. విద్యాధరపురం కబేళా రోడ్డులోని ప్రభుత్వ బాలుర పరిశీలన గృహాన్ని (జువెనైల్ హోమ్) కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, జడ్జి కేవీ రామకృష్ణయ్య ఆదివారం సందర్శించారు. హోమ్‌లోని రికార్డులు పరిశీలించి పిల్లలతో ముచ్చటించారు. హోమ్‌లో సౌకర్యాలు, వారి సమస్యలు, వారికి కల్పించే న్యాయ సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన పిల్లలకు చట్టాలపై అవగాహన కల్పించారు. అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సేవలను అందిస్తామని చెప్పారు. తెలిసీ తెలియని వయసులో నేరాలకు పాల్పడటం సరి కాదని, ఆలోచించి అడుగు ముందుకు వేయాలని బాలురకు సూచించారు. హోమ్ నుంచి బయటకు వెళ్లిన తర్వాత నేరాలు, గొడవలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలుగుతూ సమాజంలో మంచి వ్యక్తిగా గుర్తింపు పొందాలని హితవు పలికారు. కార్యక్రమంలో జువెనైల్ హోమ్ పర్యవేక్షణాధికారి రామమోహన్‌రెడ్డి, ప్రొహిబేషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

400 మందికి ఉచిత వైద్యపరీక్షలు



శిబిరంలో వైద్యపరీక్షలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉచిత వైద్యసేవలను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యకర జీవనం సాగించాలని గుండె వైద్యనిపుణులు డాక్టర్ పల్లెం పెద్దేశ్వరరావు సూచించారు. దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం పెద్దేశ్వర్ హార్ట్ కేర్ సెంటర్, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తరచూ వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సామాన్యులకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా తాము ఖరీదైన పరీక్షలను అనుభవజ్ఞులైన వైద్యులతో ఉచితంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం 400 మందికి ఉచితంగా గుండె పరీక్షలు, బీపీ, షుగర్, ఈసీజీ గుండె స్కానింగ్ (ఎకో) చేసి మందులు పంపిణీ చేశారు.

ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి



అమ్మవారికి పూజా సామగ్రిని తీసుకెళ్తున్న దుర్గగుడి కమిటీ చైర్మన్ రాంబాబు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర ప్రజలు సుఖ శాంతులతో, సంతోషంగా ఉండాలని కోరుకుంటూ అమ్మవారి సంబరం నిర్వహించామని దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు పేర్కొన్నారు. బ్రాహ్మణ వీధిలో దేవస్థాన పరిపాలన భవనం ఆవరణలోని జమ్మిచెట్టు వద్ద దేవతామూర్తులకు చైర్మన్ కర్నాటి రాంబాబు కుటుంబ సమేతంగా పూజలు నిర్వహించి, ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి చేరుకున్నారు. అమ్మవారిని దర్శించుకుని పూలు, పండ్లు, పూజా సామగ్రి, పసుపు, కుంకుమ, చీర సమర్పించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యులు కట్టా సత్తెయ్య, చింకా శ్రీనివాసులు, దేవిశెట్టి బాలకృష్ణ, చింతా సింహాచలం, బచ్చు మాధవీకృష్ణ, కేసరి నాగమణి, తొత్తడి వేదకుమారి, అనుమోలు ఉదయలక్ష్మి పాల్గొన్నారు.

గురుపౌర్ణమి కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీ షిర్డీ సాయిబాబా మందిరంలో వచ్చే నెల 3వ తేదీ గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి తెలిపారు. ముత్యాలంపాడులోని బాబా మందిరంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3వ తేదీ సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు కాకడ హారతి, గణపతి పూజ, పుణ్యాహవచనంతో గురుపౌర్ణమి వేడుకలు మొదలవుతాయన్నారు. ఉదయం 5 గంటలకు పంచామృతాలతో సహస్ర కలశాభిషేకం, మండపారాధన, మహన్యాస పారాయణం, పంచామృత సహస్ర కలశ ఆహ్వాన అభిషేకం, శ్రీ విష్ణు సహస్రనామ పారాయణం జరుగుతాయన్నారు. ఉదయం 11 గంటలకు పుష్పాలతో అర్చన, మధ్యాహ్నం 12 గంటలకు మధ్యాహ్న హారతి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విజయదుర్గ ఆలయంలో చండీహోమం



చండీహోమం చేస్తున్న ఆలయ అర్చకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): జ్యేష్ఠ బహుళ అమావాస్య, ఆదివారం పురస్కరించుకుని భీమన వారి పేటలోని శ్రీవిజయదుర్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి విశేష అభిషేకాలు, చండీ హోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చింతలపాటి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి, పవన్‌కుమార్‌శర్మ స్వామి వారికి పూజా కార్యక్రమాలు చేశారు. తొలుత ఆలయంలోని అర్ధనారేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అనంతరం యాగశాలలో చండీహోమాలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా చేశారు. పలువురు ఉభయదాతలు, భక్తులు గోత్రనామాలతో స్వామి వారికి విశేష పూజలు జరిపించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు.

గో సంరక్షకుల ఆందోళన



కబేళా వద్ద గో పరివార్ సభ్యులతో మాట్లాడుతున్న సీఐలు సలాం, సుబ్రహ్మణ్యం

భవానీపురం(విజయవాడపశ్చిమ): జంతు వధ నిబంధనలకు విరుద్ధంగా రెండు, మూడు నెలల లేగ దూడలతోపాటు పాలిచ్చే గేదెలను సైతం వధించడానికి కబేళాకు తీసుకురావడం దుర్మార్గమని గో పరివార్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు తోట సురేష్‌బాబు, బ్లూక్రాస్ ప్రతినిధి సురేష్ జాగు, విజయవాడ యానిమల్ యాక్టివిస్ట్ పసుమర్తి ఈశ్వరి, యానిమల్ రెస్క్యూ ఆర్గనైజేషన్ ప్రతినిధి గోపాల్‌రావు సూరాబత్తుల, వీహెచ్‌పీ ప్రతినిధులు ఆందోళనకు దిగారు. మరో వైపు కబేళాకు చెందిన సిబ్బంది, వ్యాపారులు వారితో గొడవకు దిగారు. రెండు వర్గాల మధ్య వాగ్వివాదం చోటుచేసుకోవడంతో ఆదివారం అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పోలీసులు వచ్చి వారిని స్టేషన్‌కు తరలించటంతో గొడవ సద్దుమణిగింది. అక్కడ వెస్ట్ ఏసీపీ డాక్టర్ కె హనుమంతరావు ఇరువర్గాల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం హరేరామ హరే కృష్ణ సంస్థ ప్రతినిధి రాధా మనోహర్ దాస్‌కు ఏసీపీ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. వీఎంసీ వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ రవి చంద్ మాట్లాడుతూ వ్యాపారులు లారీలో తీసుకువచ్చిన మందతోపాటు లేగ దూడలుకూడా ఉన్నాయని, వాటిని పంపించి వేస్తామని తెలిపారు.

వయోవృద్ధ సేవలు నిరుపమానం



వయోవృద్ధులకు నిత్యావసరాలు అందజేస్తున్న డాక్టర్ ఈశ్వర్, ట్రస్ట్ సభ్యులు, దాతలు

మధురానగర్(విజయవాడసెంట్రల్): వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలు నిరుపమానమని రిటైర్డ్ అడిషనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ జి.ఈశ్వర్ అన్నారు. దుర్గాపురం విజయ్‌నర్సింగ్ స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ 70 సంవత్సరాలు నిండి, ఎవరూ పట్టించుకోని వయోవృద్ధులను గుర్తించి గత 192 నెలలుగా వారికి నిత్యావసర సరుకులు అందజేయడం, ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం అభినందనీయమన్నారు. వయోవృద్ధులను ఆదరించడం ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా గుర్తించాలని సూచించారు. జైన్స్ అందిస్తున్న సేవలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని పని చేయాలని చెప్పారు. ఇంత మంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న ట్రస్ట్‌కు అవసరమైన సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు. శ్రీ సంభవనాథ్ జైన్ శ్వేతాంబర్ మూర్తిపూజక్‌సంఘం సెక్రటరీ పన్నాలాల్ డీ జైన్ వవయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ సేవలను అభినందించారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి ట్రస్ట్ ద్వారా అందజేస్తున్న సేవలు వివరించారు. అనంతరం దాత మహేంద్ర హోజరీ సెంటర్ సహకారంతో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు కార్యక్రమంలో మోడ్రన్ కేఫ్ అధినేత మురళీధర్, ట్రస్టీలు తట్టి అర్జునరావు, ఎన్వీయూ సతీష్‌కుమార్, కె. మధుసూదనరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్ గోదావరి తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గోల్డ్ షాపులో సేల్స్‌మెన్‌గా పని చేస్తున్న వ్యక్తి అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. గొల్లపూడి మౌలానగర్‌కు చెందిన షేక్ మహ్మద్ ఇమామ్ ఓ జ్యూయలర్స్‌లో సేల్స్ మెన్‌గా పనిచేస్తున్నాడు. రోజూ ఇంటి నుంచి షాపునకు వెళ్లి వస్తుంటాడు. శనివారం ఇంటి నుంచి వెళ్లిన మహ్మద్ ఇమామ్ తిరిగి రాలేదు. తెలిసిన వాళ్లను, బంధువులను, స్నేహితులను అడిగినా ఆచూకీ లభించలేదు. దీనిపై ఇమామ్ తండ్రి షేక్ మహ్మద్ ఇలాయస్ తన కుమారుడు కనిపించడం లేదని భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.